క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోండి

అన్నపురెడ్డిపల్లి: రైతు బీమాకు అర్హత కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అనూష తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఏఓ మాట్లాడుతూ.. గతంలో రైతు బీమాకు దరఖాస్తు చేయని రైతులు, కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు దారుల వయస్సు 18 నుండి 59 సంవత్సరాలలోపు ఉండాలని అన్నారు. అర్హత కల రైతులు దరఖాస్తు ఫారంతో పాటుగా పట్టాదారు పుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డుల నకలు పత్రాలను, క్లస్టర్ల పరిధిలోని ఏఈఓలకు అందజేయాలని తెలియజేశారు.

బిల్లులు చెల్లించాలి

అశ్వాపురం: గత ప్రభుత్వంలో సర్పంచ్‌లు అప్పులు చేసి గ్రామ పంచాయతీల్లో వేసిన సీసీ రోడ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని మొండికుంట మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని మొండికుంటలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కోసం రోడ్లు వేసిన సర్పంచ్‌లు... ఇప్పుడు బిల్లులు రాక అప్పుల పాలయ్యారని అన్నారు.

ముందస్తు చర్యలు



భద్రాచలం ఏరియా ఆస్పత్రికి గర్భిణులను తరలిస్తున్న వైద్య సిబ్బంది

చర్లరూరల్: వాగులు, వంకలు పొంగి ప్రవహించడం, గోదావరి నది క్రమంగా పెరుగుతుండడంతో చర్ల మండలం సత్యనారాయణపురం పీహెచ్‌సీ పరిధిలో నెల రోజుల్లో కాన్పు సమయం ఉన్న పన్నెండు మంది గర్భిణులను వైద్యాధికారిని దివ్యనయన సోమవారం భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా తరలించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

సుదర్శన హోమం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సుదర్శన హోమాన్ని సోమవారం వైభవోపేతంగా నిర్వహించారు. యజ్ఞాచార్యులు అయిన గిరిధరాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా హోమం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు

గుండాల: ఆళ్లపల్లి మండలంలో గత ఆరు రోజులుగా కురుస్తున్న వర్షాలు సోమవారం తగ్గుముఖం పట్టడంతో అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మండల పరిషత్ అధ్యక్షురాలు శ్రీమతి కోండ్రు మంజు భార్గవి, ప్రభుత్వ వైద్యాధికారి రేవంత్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బత్తిన శ్రీనివాసరావులు పర్యవేక్షించారు. పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, రమేష్, వెంకటేశ్వర్లు, విజయ్ కుమారి, త్రివేణి, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్, నరేష్ పాల్గొన్నారు.

పశువులకు అడ్డాగా రోడ్లు



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రోడ్డుకు అడ్డంగా తిష్టవేసిన పశువులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో పశువులు ప్రధాన రహదారులపైనే సంచరిస్తూ.. ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కొంత మంది పశువులను రోడ్డుపై వదిలేయడంతో అవి అక్కడే సేద తీరుతున్నాయి. పట్టణంలోని ప్రధాన రోడ్లు బస్టాండ్ నుంచి అంబేద్కర్ సెంటర్, అదే విధంగా చర్ల రోడ్డు, కూనవరం రోడ్డులో పదుల సంఖ్యలో పశువులు కూర్చుంటున్నాయి. పశువులు రోడ్డుపైనే ఉండడంతో పలుమార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

దమ్మపేట: మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కొండ్రు శ్రీరాములు సతీమణి కొండ్రు లక్ష్మీదేవి, ఇటీవలే అనారోగ్యంతో మరణించగా.. ఆమె కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు పరామర్శించారు. సోమవారం మండలంలోని అంకంపాలెం గ్రామంలో మృతురాలు లక్ష్మీదేవి చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే తాటి పూలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పొట్టా రాజులు, బైటి రాజేష్, వాడే నాగరాజు, కాకా భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి జయంతి

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో కళాకారుడు పిలక నాగేంద్రరెడ్డి ఆధ్వర్యంలో దాశరథి క్రిష్ణమాచార్య జయంతిని సోమవారం నిర్వహించారు. దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పొడకలపల్లి శ్రీను, కాకి వెంకటరెడ్డి, నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

అదే జోరు.. అదే వాన

- ఉప్పొంగిన వాగులు
- పొలాలు, రోడ్లను కమ్మిన వరద
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న జనం



పినపాక-మారేడుగూడెం ప్రధాన రహదారిపై చేరిన వర్షపు నీరు



బూర్గంపాడు: పులితేరు వద్ద నీటమునుగుతున్న పంటచేలు



పినపాక: ఉధృతంగా ప్రవహిస్తున్న బయ్యారం పెద్దవాగు



అమ్మగారిపల్లి- అమెర్ధ గ్రామాల మధ్య దుస్థితి..



చర్ల: బత్తినపల్లి తిప్పాపురం మార్గంలో రహదారికి గండి..

పినపాక: అల్ప పీడన ప్రభావంతో రెండు రోజులగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు ప్రాంతాలు జలమయ్యాయి. బయ్యారం పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. బయ్యారం, పినపాక గ్రామాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. తిన పాక మారేడు గుంపు వెళ్లే ప్రధాన రహదారిపై నీళ్లు చేరాయి. గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో మండల అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. పొట్లపల్లి చెక్ డ్యామ్‌లో చేపల వేటకు వెళ్లి కొట్టుకుపోయిన పాయం నాగేశ్వరరావు ఆచూకీ లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు. గజతగాళ్లతో, ఎన్డీఆర్ బృందంతో గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

గుండాల: ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు మండలంలోని వాగులు రోజురోజుకూ ఉధృతంగా పొంగుతున్నాయి. దీంతో గిరిజన గ్రామాల ప్రజలు జలదిగ్బంధంలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లోని కిన్నెరసాని, మల్లన్న వాగు, తొట్టి వాగు, దున్నపోతుల వాగు, జల్లేరు, కిన్నెరసాని వాగులు సైతం ఉప్పొంగుతున్నాయి. ఆదివారం నుంచి సోమవారం తెల్లవారు జాము వరకు భారీ వర్షం కురిసింది. ఎగువ నుంచి వస్తున్న వరదలతో వాగులు ఉగ్రరూపం దాల్చుతున్నాయి. కొవడటంచ-గుండాల మధ్య కిన్నెరసాని వాగు లోలెవల్ వంతెనపై వాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా పోలీసులు, రెవెన్యూ, గ్రామ పంచాయతీ సిబ్బంది పహరా కాస్తున్నారు. నాగారం, పాలగూడెం, కొడవటంచ, మల్లెల గుంపు, దొంగతోగు, మటంలంక, ఆళ్లపల్లి మండలంలో కిన్నెరసాని, జల్లేరు వాగులతో చంద్రాపురం, అడవిరామారం, రాఘవాపురం, సీతానగర్, రాయిగూడెం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

పెరుగుతున్న గోదావరి ఉధృతి

బూర్గంపాడు: గోదావరి వరదలు బూర్గంపాడు మండల వాసులను కలవరపెడుతున్నాయి. సోమవారం సాయంత్రానికి గోదావరి 50 అడుగులకు చేరటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గోదావరి వరదనీరు పంటచేలలో వచ్చి చేరుతుంది. బూర్గంపాడు, సంజీవరెడ్డిపాలెం, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, సారపాక, మోతె పట్టీనగర్, ఇరవెండి గ్రామాలకు చెందిన పంటచేలలోకి క్రమేపీ వరద నీరు చేరుతోంది. బూర్గంపాడుకు సమీపంలోని పులితేరు వద్ద, కొల్లుచెరువు వద్ద, నాగినేనిప్రోలు, సారపాకల మధ్య పెదవాగు వద్ద గోదావరి వరద నీరు పంటచేలలోకి చేరుతోంది. బూర్గంపాడు-సోంపల్లి గ్రామాల మధ్య రహదారిపై వరదనీరు చేరటంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. వరదలకు నది పరివాహక ప్రాంతాలలో రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు నీటమునుగుతున్నాయి. గోదావరి వరదలతో పశువులు, జీవాలు మేతకు విడవలేనటువంటి పరిస్థితులు నెలకొన్నాయి. మరో ఐదు అడుగులు వరద పెరిగితే గ్రామాలలోకి వరదనీరు చేరే అవకాశాలున్నాయి. అధికార యంత్రాంగం ముంపు గ్రామాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముంపు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

రోడ్డుకు గండి..

చర్ల: మండలంలోని బత్తినపల్లి తిప్పాపురం మార్గంలోని రహదారికి గండి పడింది. భారీగా కురుస్తున్న వర్షాలకు తిప్పాపురం, గోరుకొండ ప్రాంతాల వైపు నుంచి వచ్చిన వరదనీటితో తిప్పాపురం శివారులోకి రహదారికి చిన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన తూములు వరద ఉధృతికి కొట్టుకు పోయాయి. దీంతో బత్తినపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి. అతికష్టం మీద బత్తినపల్లి గిరిజనులు వ్యవసాయ పొలాల మీద నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

మెట్లు లేక ఇక్కట్లు..



విరిగిపోయిన ఓవర్ హెడ్ ట్యాంక్ మెట్లు..

ములకలపల్లి: ములకలపల్లికి తాగునీరందిచే ఓవర్ హెడ్ ట్యాంక్ మెట్లు శిథిలావస్థకు చేరడంతో మల్టీపర్పస్ వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ఎస్టీ హాస్టల్ వెనుకభాగంలో సుమారు పాతికేళ్ల క్రితం వాటర్ ట్యాంక్ నిర్మించగా, పాతమసీదు రోడ్డులోని పలువీధులకు ఈట్యాంక్ నుంచి మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నారు. ఐతే ట్యాంక్‌కు ఏర్పాటు చేసిన ఇనుప మెట్లు తుప్పుపట్టి ప్రమాదకరంగా మారాయి. కొన్ని చోట్ల మెట్లు విరిగిపోగా, ఇటీవల పైభాగంలో మెట్లు ట్యాంక్ నుంచి ఊడి కింద పడిపోయాయి. దీంతో ట్యాంక్ క్లీనింగ్, బ్లీచింగ్ చేసేందుకు కార్మికులు నానాతంటాలు పడాల్సివస్తోంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రవిని 'సాక్షి' వివరణ కోరగా, ఇనుప మెట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభిస్తామన్నారు.

విద్యా రంగానికి నిధులు కేటాయించాలి

గుండాల: విద్యారంగానికి ఈ ఏడాది బడ్జెట్లో కేంద్రం 10 శాతం, రాష్ట్రం 30 శాతం నిధులు కేటాయించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె.షాహిద్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే ప్రక్రియలో భాగంగా అధిక నిధులు కేటాయించాలని, రాష్ట్రంలో ప్రతి జిల్లాకు నవోదయ పాఠశాల, ఐఐఐటీ, ఐఐఎం లాంటి విద్యాసంస్థలు తెలంగాణలో ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని షాహిద్ డిమాండ్ చేశారు.

ములకలపల్లి: 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో విద్యారంగానికి అధికశాతం నిధులు కేటాయించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వర్కా అజిత్ ఒక ప్రకటనలో కోరారు. మోదీ ప్రభుత్వం గత పదేళ్లుగా విద్యకు సరైన నిధులు కేటాయించలేదని విమర్శించారు.

సీఐగా బాధ్యతలు స్వీకరణ



పినపాక: ఈ బయ్యారం నూతన సీఐగా వెంకటేశ్వరరావు సోమవారం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న సీఐ కరుణాకర్ అశ్వరావుపేట ఇన్‌చార్జ్ సీఐగా విధులు నిర్వహిస్తుండడంతో ఇంటిలిజెన్స్ సీఐగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావును ఈ బయ్యారం స్టేషన్‌కు బదిలీ చేశారు.

సమావేశాన్ని జయప్రదం చేయండి

దమ్మపేట: ఈ నెల 24న కొత్తగూడెంలో నిర్వహించే ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కొలికపోగు కాంతారావు కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ మండల సమావేశంలో కాంతారావు మాట్లాడారు. ముసలయ్య, వీరయ్య, అశోక్, పుల్లారావు పాల్గొన్నారు.

బడిలో నిల్వ నీరు తొలగింపు



పాఠశాలలో నిల్వ ఉన్న వర్షపు నీటిని బయటకు పంపిస్తున్న దృశ్యం

చర్లరూరల్: పాతచర్ల ఏరియాలోని శివాలయం వెనుక ఉన్న ప్రభుత్వ పాఠశాలలో నిల్వ ఉన్న వర్షపు నీటిని సోమవారం చర్ల మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.కృష్ణ జేసీబీతో తొలగింపు చర్యలు చేపట్టారు. అనంతరం ప్రభుత్వ బాలికల హైస్కూలు ఎదుట ఉన్న మురుగు నీటిని సైతం తొలగించారు.

విద్యార్థులకు ఎన్డీఆర్‌ఎఫ్ అవగాహన



డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ అధికారులు

భద్రాచలంఅర్బన్: ప్రకృతి వైపరిత్యాలు, తుఫానులు, వరదలు వచ్చినప్పుడు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రతలపై, ఆపద నుంచి బయటపడే మార్గాలపై ఎన్డీఆర్‌ఎఫ్ అధికారి భూపేంద్రకుమార్ నేతృత్వంలో సోమవారం పట్టణంలోని డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులకు, అవగాహన కల్పించారు. కాగా భద్రాచలంలో ఈ ఏడాది వరదలు వస్తే ముంపు ప్రాంత బాధితులను రక్షించుకునేందుకు ఈ మేరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

బదిలీ సిబ్బందికి సన్మానం

మణుగూరురూరల్: మణుగూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న రాఘవ, నాగేశ్వరరావు, యూసుఫ్ అనే ముగ్గురు సిబ్బందిని సోమవారం ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ వీరస్వామిలు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాబాకు పాలాభిషేకం

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని కాలేజ్ సెంటర్‌లో ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో బాబాకు స్వర్ణ కిరీటం అలంకరించి ఐదు వసంతాలు పూర్తయిందని ఆలయ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపల్లి సతీష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం బాబావారికి పాలాభిషేకం చేయడంతో పాటు స్వర్ణకిరీటాన్ని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించినట్లు పేర్కొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

దుమ్ముగూడెం: అధిక వర్షాల కారణంగా ఏజెన్సీ ప్రాంతంలోని అనేక గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, తక్షణమే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని సీపీఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఏజెన్సీ ప్రాంతంలో అనేక గ్రామాల్లో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నటువంటి పరిస్థితి ఉందన్నారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టి, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మర్మం చంద్రయ్య, కొమరం చంటి, సరియం నాగేశ్వరరావు, మడకం మహేంద్ర నాథ్, సుబ్బారావు, సోంది సత్తిబాబు, రామమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి



ఐటీడీఏ డీడీ మణెమ్మకు సమస్యను వివరిస్తున్న యూనియన్ నాయకులు

భద్రాచలంఅర్బన్: 17 నెలలుగా గిరిజన సంక్షేమ శాఖలోని ఔట్సోర్సింగ్ కార్మికులు వేతనాలు అందక పస్తులుంటున్నారని, వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఆఫీస్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్ లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం రూ.15,600 వేతనం చెల్లించాలని కోరారు. జీవో ప్రకారం నేరుగా కార్మికుల అకౌంట్ లోనే జీతాలు చెల్లించాలన్నారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఐటీడీఏ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మకు అందించారు. కార్యక్రమంలో పోస్టుమెట్రిక్ హాస్టల్ వర్కర్స్ సీఐటీయూ యూనియన్ నాయకులు చందా.జలంధర్,రామ, తిరుపతమ్మ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులు..

దమ్మపేట: మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు మండలంలోని గండుగులపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అర్జున్ మాట్లాడుతూ.. కార్మికుల బిల్లులను వెంటనే చెల్లించి, కనీస వేతనంగా పదివేల రూపాయలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు ఈశ్వరమ్మ, జ్యోతి, సత్యావతి, శ్రీలత, దేవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి, కొత్తూరు గ్రామాలకు చెందిన వరద ముంపు బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్ చేతుల మీదుగా స్వరాజ్యం, రాఘవరెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందించారు. ఒకొక్క కుటుంబానికి రూ.10వేలు, రూ.5వేలు చొప్పున నగదును అందించారు. ఈ రెండు గ్రామాల్లో కలిపి మొత్తం 51 మంది బాధిత కుటుంబాలకు నగదుతోపాటు, రెవెన్యూ శాఖ తరుపున బియ్యం, నిత్యవసరాలు, కూరగాయాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఆర్ఐ కృష్ణ, కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, జూపల్లి ప్రమోద్, ఆకుల శ్రీను, బండి చెన్నారెడ్డి, వల్లెపు తిరుపతిరావు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి..

భద్రాచలంటౌన్: అంతర్జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన మోడెం వంశీకి పట్టణానికి చెందిన పలువురు వైద్యులు సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ జమాల్ ఖాన్ రూ.10వేల, భద్రాచలం మిమ్స్ వైద్యుడు భవిశెట్టి శ్రీకర్ రూ.20వేల, డాక్టర్ రోశయ్య రూ.5 వేలు, భద్రాచలం వాసి భోగాల వీరారెడ్డి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. డాక్టర్లందరికీ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జీవి రామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, కోశాధికారి మహంతి కృష్ణాజి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీలో షరతులొద్దు



అశ్వారావుపేటరూరల్: మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య

అశ్వారావుపేటరూరల్: షరతులు, కోతలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు విత్తనాలు, ఎరువులను రాయితీపై సరఫరా చేయాలని, సీజనల్ వ్యాధుల పట్ల ఆరోగ్య శాఖను అప్రమత్తం చేసి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయించాలని అన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గడ్డం సత్యనారాయణ, కొక్కరపాటి పుల్లయ్య, పిట్టల అర్జున్, బి.చిరంజీవి, ముళ్లగిరి గంగరాజు, మడకం గోవిందు, సోడెం ప్రసాద్, మడిపల్లి వెంకటేశ్వరరావు, తగరం నిర్మల, తిరుపతమ్మ పాల్గొన్నారు.

నాట్లు మొదలైనా జమ చేయలే..

దుమ్ముగూడెం: రైతుభరోసాను రైతుల ఖాతాలో వెంటనే జమ చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం లక్ష్మీనగరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వరి నారులు పోసేటప్పుడు ఇచ్చే రైతుబంధు వరి నాట్లు మొదలైనా ఇప్పటికీ ఇవ్వలేదని విమర్శించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, నాయకులు జాని పాషా, తునికి కామేశ్వరరావు, కొత్తూరి సీతారామారావు, నోముల రామి రెడ్డి,సోషల్ మీడియా అధ్యక్షులు దామెర్ల శ్రీనివాస్, అల్లాడి వెంకట్, కుమ్మరికుంట్ల సూర్యాచందరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో పర్యటన



అశ్వాపురం: కుమ్మరిగూడెంలో స్థానికులతో మాట్లాడుతున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి



మణుగూరురూరల్: కోడిపుంజుల వాగు ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు



దుమ్ముగూడెం: సున్నంబట్టిలో పర్యటిస్తున్న అధికారులు



కరకగూడెం: బూడిదవాగు బ్రిడ్జిని పరిశీలిస్తున్న సీఐ, అధికారులు

మణుగూరురూరల్: మండలంలోని కూనవరం గ్రామపంచాయతీ రైల్వే బ్రిడ్జి సమీపంలోని కోడిపుంజుల వాగు ఉధృతిని మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డి, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావులు సోమవారం సందర్శించి పరిశీలించారు. వాగుదాటే ప్రయత్నం చేయొద్దని స్థానికులకు సూచించారు. ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసేందకు కూడా పలు గ్రామాల్లో సీఐ సతీష్‌కుమార్‌తో కలిసి తహసీల్దార్ పర్యటించారు. కార్యక్రమంలో ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావు, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టడంపై సీరియస్..

కోడిపుంజుల వాగులో పలువురు చేపలు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎంపీఓ వెంకటేశ్వరరావు, సమితిసింగారం పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌లు సోమవారం అక్కడికి చేరుకుని చేపలు పడుతున్న వారిని మందలిస్తూ పలు సూచనలు ఇచ్చారు. ఉధృతంగా వాగు ప్రవహిస్తున్నప్పుడు చేపలు పట్టడం ప్రమాదకరమని తెలిపి వారిని అక్కడ నుండి పంపించి వేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో పర్యటన

దుమ్ముగూడెం: మండలంలోని గోదావరి వరద ముంపు గ్రామాలైన సున్నం బట్టి, మాల కాశీనగరం, గంగోలు, సంగెం గ్రామల్లో సోమవారం మండల అధికారులు పర్యటించి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. గోదావరికి వరద పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. అత్యవసరం అయితే పునరావాస కేంద్రాలకు తరలిరావడానికి సంసిద్ధంగా ఉండాలన్నారు. జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, డీఎల్‌పీఓ సుధీర్, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ ముత్యాలరావు, ఆర్ఐ లక్ష్మయ్య తదితరులు పర్యటించారు.

అశ్వాపురం: గోదావరి వరద ప్రభావిత ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గోదావరి పరివాహక ప్రాంతాలైన పాములపల్లి, కుమ్మరిగూడెం, బట్టీలగుంపు గ్రామాలలో సోమవారం గోదావరి వరద తీవ్రతను డీఎస్పీ అధికారులతో కలిసి పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ అశోక్ రెడ్డి, ఏడీఏ తాతారావు, తహసీల్దార్ స్వర్ణలత, ఎస్సై సురేష్, ఏఓ సాయిశంతన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు పోలీసులకు సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం మండలంలో ప్రమాదకరంగా ఉన్న బంగారుగూడెం, బూడిద వాగు బ్రిడ్జిలను పరిశీలించి మాట్లాడారు. బ్రిడ్జిల వద్ద వరద తీవ్రత తగ్గుముఖం పట్టేవరకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడూళ్ల బయ్యారం ఎస్సై రాజ్ కుమార్, కరకగూడెం ఎస్సై రాజేందర్ పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ ఆధ్వర్యంలో..

బూర్గంపాడు: గోదావరి వరదల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అన్నారు. సోమవారం బూర్గంపాడులోని వరద ప్రభావిత ప్రాంతాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు గొనెల నాని,సాధిక్‌పాషా తదితరులు పాల్గొన్నారు.